
# పెనుగాలి చాటులో...




## కోమలాదేవి

జయరాజు ఇల్లు చేరేసరికి సాయంత్రం ఆరు గంటలైంది. వి. ఐ. పి. సూట్ కేస్ గోడవారగా ఉంచి తలుపు గడియ వేసుకుని కుర్చీలో కూలబడ్డాడు. తడిసిన గుడ్డలు విప్పకుండా తల తుడుచుకోకుండా కూర్చున్న కొడుకును చూచి తల్లి ఆశ్చర్యపోయింది.

"ఆదేమిటిరా. తల తుడుచుకొని గుడ్డలు మార్చుకో. జలుబు జ్వరం...."

"ఉండమ్మా"అని ఆమెను వారించాడు. అతడి చూపులోని తీక్షణతకు ఆమె మౌనం దాల్చింది. లోపలికివెళ్ళి భర్తతో చెప్పింది. ఆయన రాగానే రాజు గబగబ బాత్‌రూంలోకి దూరాడు.

పొడిగుడ్డలు వేసుకుని తల తుడుచుకుంటూ ఇవతలికొచ్చాడు. తండ్రి వి.ఐ.పి తెరిచి చూచాడు. అందులో ఏమీ లేవు. ఏవో మామూలు గుడ్డలు, షేవింగ్ సెట్, టవలు లాంటివి తప్ప అతడికి కావలసిన వస్తువులేం లేవు.

"నేను తెమ్మన్నది తేలేదేం?" తండ్రి భృకుటీకరించి కోపంగా ప్రశ్నించాడు.

"తేలేదు. నేను అటు వెళ్ళలేదు."

"అదేం అంతా తయారై వెళ్ళావుగా!"

"మనసు మార్చుకున్నాను."

"ఎందుకు? భయపడ్డావా? నీ వెర్రి.... రేపు వెళ్ళులే. నేను ఫోన్ చేస్తాను."

"ఊహూ.... నేను ఎన్నటికి వెళ్ళలేను. వెళ్ళను. నా మనసు మరి అటు మళ్ళించకండి. అది ఒక విధమైన భయమే. అంతే కాదు. సిగ్గుపడ్డాను.

ఏం జరిగింది?"తండ్రి క్రోధంతో అసహనంతో ప్రశ్నించాడు.

రాజు తాపీగా కూర్చుని తల్లి అందించిన కాఫీ తీసుకున్నాడు. ఆమెకేసి జాలిగా చూచాడు. ఒక్కో సిప్ తీసుకుంటూ ప్రారంభించాడు.

ఉన్నట్లుండి ఆకాశం కారుమేఘావృతమైంది. చెట్లు ప్రచండ వాయువులు పూనకం వచ్చినట్లు ఊగిపోతున్నాయి. ఒక్క పెద్దగాలి వీచింది-ఒక్క ఊపున వర్షం ప్రారంభమైంది.

జనం అటు ఇటు పరుగులుదీస్తూ దొరికిన నీడలో తలదాచుకుంటున్నారు. వరండాలలో, అంగళ్ళబైట నుంచున్నారు. రాజు వి.ఐ.పి పట్టుకుని నడుస్తున్నాడు. తను సరిగ్గా నాల్గు గంటలకంతా 'అతణ్ణి' కలుసుకోవాలి. తను ఎక్కడా ఆగటానికి వీల్లేదు. రిక్షాలు దొరక్క అతడు నడుస్తూనే ఉన్నాడు. వర్షం కురవడంలో తగ్గు కనిపించలేదు. పూర్తిగా తడిచిపోయాడు. చలివేస్తోంది కూడా. ఒక్క పదినిమిషాలు ఎక్కడైనా ఆగాలి....ఎందుకో అందరూ తనవైపే చూస్తొన్నట్లు భ్రమ.

కాస్త దూరంలో ఉన్న కిళ్ళీకొట్టు దగ్గర జనం ఎక్కువలేరు. కాని ఉన్న పదిపన్నెండు కుర్రవాళ్ళు వెర్రివెర్రిగ అరుస్తూ ఈలలువేస్తూ సినిమా పాటలు పాడుతున్నారు.

ప్రక్క సందులోంచి ఒక అమ్మాయి వస్తూ కనిపించింది. అతడు అంతగా పట్టించుకోలేదు.

ఆమె ఒక్క పరుగున అతణ్ణి సమీపించింది.

"ఏమండీ-మీ రెవరో నాకు తెలీదు. ఈ సమయంలో మీరు నాకు సహాయం చేయాలి. నేను ఒంటరిగా ఉన్నానన్న అభిప్రాయం వారికి తెలిస్తే ఆ మూక ఊరుకోదు. ప్లీజ్....చిన్న నాటకం ఆడాలి."

అతడి నుండి జవాబు రాకముందే ఆమె అతడి ప్రక్కకు వచ్చి తన గొడుగు అతడి తలపై ఉండేలా ఎత్తింది.

అతడు ఆశ్చర్యం నుండి తేరు కున్నాడు. ఇద్దరూ కిక్కిరొట్టు సమీపించారు.

ఒక ఎరుపురంగు 'బుల్లెట్' ఉంది. దానిమీద నలుగురైదుగురు కూర్చుని ఉన్నారు. వీరిని చూచి ఈలలు వేశారు. 'బర్ సాత్ మే' అంటూ బిగ్గరగా రాగం తీశారు. మిగతా ఐదుగురు ఆమె తమ మధ్యలో ఉండేలా జరుగుతున్నారు.

ఆమె చేతిలోని గొడుగు తీసుకొని మూసి పట్టుకున్నాడు. వాళ్ళంతా అతడి వైపు చూచి అర్థంకాక ఇంకా పిచ్చిగా నవ్వటం ప్రారంభించారు.

అప్పుడు ఆమె అంది. "నీ కోసమే బయలుదేరాను .... డబ్బు కావాలన్నయ్యా...." అంది మెల్లగా అతి దీనంగా.

"ఎందుకమ్మా!"

"మా ఆడబడుచు పెళ్ళి. మా తరపున కొంత డబ్బు కావాలన్నారు. నేను ఇవ్వనంటే ఇంట్లో పెద్ద గొడవ అవుతుంది. అంత పెద్ద అన్నయ్యని పెట్టుకుని ....అంటూ దెప్పుతారు. నువ్వే ఆలోచించు నిన్ను అడగకూడదు, కాని నాకెవరున్నారు?"

అతడినుండి జవాబు రాలేదు. ఆమె గోముగా అసహనంగా రాజు రెక్కను అంటీఅంటనట్లు పట్టి కుదిపింది.

"మీ వదినను అడగాలి....ఎంత కావాలి?"

"కనీసం మూడువేలు....అప్పుగానే ఇవ్వు అన్నయ్యా—తీర్చేస్తాను. అన్న మాట తప్పనని నీకు తెలుసునుగా!"

"తెలుసునమ్మా...."

వర్షం—ఉరుముల శబ్దంలో వాళ్ళిద్దరు కాస్త గట్టిగానే మాట్లాడుకుంటున్నారు.

ఇదేదో—చెల్లి సంసారాన్ని చక్కదిద్దే అన్నయ్య—చెల్లి సంసారం గొడవ 'ప్లాట్'లా ఉందని ఆమె చుట్టూ అర్ధ చంద్రాకృతిలో నుంచున్న ఆ కుర్రాళ్ల మెల్లగా ఇవతలికి సర్దుకొని వినకూడదనుకుంటూనే వాళ్ళ సంభాషణ వింటున్నారు.

"ఎప్పుడు తెస్తావు?" ఆమె అన్న ముఖంలోకి ఆశగా చూస్తూ ప్రశ్నించింది.


"రెండుమూడు రోజుల్లో...."

"ఎంత మంచివాడవన్నయ్యా .... వదినకు చెప్పు....నీ కూతుర్ని కోడలిగా చేసుకున్నప్పుడు పువ్వుల్లో పెట్టి చూచుకుంటానని."

రాజు నవ్వేశాడు.

వర్షం తగ్గలేదు. పదినిమిషాలనుకున్నవాడు అరగంట అయింది. అక్కడ తనకు అలక్ష్యమైపోతుంది. ఈమెను ఇలా వొదిలి వెళ్ళలేడు. వర్షం తగ్గేవరకు ఉండాలి. ఆమె తన ఇంటివైపు వెళ్ళిపోతే తను తన గమ్యస్థానం చేరుకుంటాడు. ఆమె ఏదో వాగుతూనే ఉంది. భర్త, పిల్లలు, తన ట్యూషన్లు, హైద్రాబాద్‌లో నీళ్ళఎద్దడి అన్నీ చెబుతోంది. అతడు ఊ కొడ్తున్నాడు.






(దీపావళి 1965 ప్రత్యేక సంచిక నుండి)

అప్పుడప్పుడు మామూలుగా ఆమె వైపు తిరిగి ఆమెను గమనించాడు. పాతిక సంవత్సరాల లోపున ఉంటుందామె. చూడటానికి బాగానే ఉంది. మోకాళ్ళవరకు చీర తడిచి ఉంది. పెద్ద బాగ్‌ను ఎదకు అదుముకుని ఉంది.

అన్నింటికన్నా అతణ్ణి ఆశ్చర్యపర్చిన విషయం ఆమె ఎంతో సహజంగా సంఘటనను సృష్టించి తనతో అన్నయ్యతో మాట్లాడినట్లు మాట్లాడుతోంది!

ఆ కుర్రమూక వీళ్ళను పట్టించుకోటం మానేసింది. వాళ్ళ ధోరణిలో వాళ్లు పడిపోయారు. అటుగా ఒక రిక్షా వచ్చింది. ఆ రిక్షా ఎక్కి వెళ్ళిపోవాలన్నంత ఆశ పుట్టింది రాజుకు. కాని ఈమె ఉంది మరి!

వర్షం ఉధృతం తగ్గింది.

రిక్షాను పిలిచాడు. "రిక్షామీద వెళ్ళిపో. ఇంకా అలస్యమైతే కష్టం....వస్తాను.... రెండు మూడు రోజుల్లో .... మీ అయన్నడిగేనని చెప్పు."

ఆమె రిక్షా ఎక్కింది. "గొడుగు తీసుకెళ్తావా?"

"ఒద్దులే. ఎలాగో పూర్తిగా తడిచిపోయాను."

"వెళ్తొస్తానన్నయ్యా!"

"ఆ....చిల్లరుందా?"

"ఉందిలే....పోనియ్...."

రిక్షా కదిలిపోయింది.

నలభై నిమిషాలు!

రాజు ఇక ఆగలేదు. గబగబ వెళ్ళి తను వెళ్ళవలసిన స్థలం సురక్షితంగా ఉందో లేదోనని ఒక నంబరుకు ఫోన్ చేశాడు.

ఆ ఫోన్‌లో అతను చెప్పిన విషయం విని భయంతో కంపించిపోయాడు. ఆ 'మెసేజ్' మర్మంగా కోడ్‌లో ఉంది. "డాక్టర్ కోసం కనిపెట్టి ఉన్నారు. పేషెంట్‌కు సీరియస్‌గా ఉంది. కదలించ కూడదట."

అంటే! దాని అర్థం! నేను వెళ్ళటం లేటైంది. ఎంత మేలైంది! ట్రెయిన్‌లో నేను 'వాళ్ళ' ఎక్కాలి. హడావిడిగా బర్తులకోసం చూచుకుంటూ ఉండాలి. ఆ సందడి గోలలో నేను ఈ సూట్‌కేస్ వొదిలి వాళ్ళ సూట్‌కేస్ తీసుకుని దిగి రావాలి. కాని ఆ పేషెంట్‌కు సీరియస్‌గా ఉందంటే పోలీసులు లేక సి.ఐ.డి.లు పట్టుకున్నారన్నమాట! నేను వచ్చేశాను.

తండ్రి ముఖంలో రవ్వంత గాభరా! అంతేనా? తండ్రికి భయం లేదా? అంత నిబ్బరంగా ఎలా ఉండగల్గుతున్నాడు!

"నాన్న నీకు భయంగాలేదూ?"

ఆయన నవ్వాడు. "ఇందులో భయ పడవలసిందేమీలేదు. ఆ దొంగనోట్లు అటు ఇటు వెళ్ళటానికి నేను ఒక కాంటాక్ట్ మాత్రమే. పట్టుకున్నవాడిని ప్రశ్నిస్తే హాంకాంగ్ నుండి తెచ్చాను అంటాడు. నా పేరు చెప్పడు."

"ఒకవేళ నిన్నే పట్టుకుంటే."

"అచ్చం డిటెక్టివ్ కథలోలా నా బాస్ ఎవరో నాకే తెలీదు. నా పని సూట్‌కేస్ మార్చి అందులోని నోట్లకట్టల్ని ఫలానా పార్కు దగ్గర ఫలానా వేషంలో ఉన్న అతడికి అప్పగించటమే. అట్లా చేస్తే నాకు ఐదువేలిస్తారు అని చెబుతాను."

రాజు కప్‌తో ఆడుతున్నాడు.

"సరే – ఇప్పటికి ఈ పని తప్పి పోయింది. పోనీలే."

"కాదు–ఇక ఎప్పటికి ఇలాంటి పనిలో నాకు ప్రమేయం లేదు. బలవంతంగా నా చేత చేయించాలనుకుంటే నేను వెళ్ళి పోతాను. ఎక్కడో చిన్న పని చూచు కొని బ్రతుకుతాను."

"పనులు అంత సులభంగా దొరుకు తాయా?"

తండ్రి నవ్వాడు.

"దొరకవు. నీకు పెద్ద ఉద్యోగం అక్కర్లేదు. ఏదైనా చేసి సంపాదించు కుంటాను."

ఆమె భర్తవైపు గాభరాగా చూచింది.

"సరేలే....ఇప్పుడవన్నీ ఎందుకు?"

అని తండ్రి అవతలకి వెళ్ళిపోయాడు.

ఇది ప్రథమ పర్యాయం. భయపడి పోయాడు. కొన్నాళ్ళు పోయాక అన్నీ సర్దుకుంటాయి. మెల్లగా నచ్చచెప్ప వచ్చుననుకున్నాడు.

"అమ్మా నాన్నతో చెప్పు....ఇకపై అయన్ని కూడ దూరంగా ఉండమను.



నాకు చాలా భయంవేస్తోంది. ఎందు కంగీకరించానా అని చాలా బాధపడ్తు న్నాను. ఆ వర్షంలో ఆమె నన్ను అపక పోయినట్లైతే, అన్నయ్య అని ఆప్యా యంగా పిల్చి తన రక్షణకోసం నన్ను చిన్న నాటకంలో ఇరికించకపోయి ఉన్నట్లయితే నేను ఈ సరికి...ఎక్కడో పోలీసుల చేతిలో తన్నులు లాఠీదెబ్బలు తింటూ....అబ్బ" రాజు తల పట్టు కున్నాడు....

వర్షం పునఃప్రారంభమైంది.

ఆ వర్షపు చినుకులతెర ఆవతల 'అన్నయ్యా' అంటూ మాట్లాడుతోంది. ఆమె పేరు కూడా తెలీదు.

ఆమె ఎవరైనాకాని....తనను రక్షిం చిన దేవత. ఆమెను మరి ఎప్పుడు అతడు చూడలేదు. కాని వర్షం కురిసిన రోజున ఆ చెల్లి అతడి మనోనేత్రానికి కనబడు తుంది.

